

## అరుణోదయం.

నిద్రావస్థలో ఉన్న మానవులను జాగృతిచేస్తూ, వారి హృదయాల నుండి చెడును దూరం చేస్తున్నట్లు చీకట్లను దూరం చేస్తూ, కర్తవ్యబోధ చేసే పరమాత్మను గుర్తుకు తెస్తూ, చిత్రకారుని నేత్రాలను తనవైపు ఆకర్షించు కుంటూ, కవి హృదయాన్ని పరవశింపజేస్తూ సూర్యుడు ఉదయించిన శుభోదయం.

కాని, యూరీ పూంచ్ ప్రాంతంలో మాత్రం అది శుభోదయం కాలేదు. బిగపట్టిన గుండెలతో, అధికమయిన భారంతో, ఏ క్షణంలో తమ జీవితం అంతమవుతుందో అన్న భయంతో, ఆ భీతిలోనూ కర్తవ్య నిర్వహణను మరవకూడదనే పట్టుదలతో శిబిరాల ముందు కూర్చుని చాయ్ తీసుకుంటున్నారు భారత సైనికులు. రాడార్‌వైపు కొందరి దృష్టులు తీక్ష్ణంగా పని చేస్తున్నాయి. మరికొందరి నేత్రాలు నిశ్చలతకు నిదర్శనాలుగా, పట్టుదలకు ప్రతిబింబాలుగా బైనాక్యులర్ అద్దాల వెనక నుంచి నీలా



ఆవేశానికి లోనుకావడం తప్పంటారు. కాని న్యాయ్యధర్మసమ్మతమైన కార్యంలో, అందునా మాతృదేశ రక్షణవంటి పవిత్ర కార్య నిర్వహణంలో ఆవేశం లేకుండా ఉండడం ఎలా సాధ్యం? ఆవేశం ఒక్కటి మాత్రమే ఉండడం నిష్ప్రయోజనం.

# అమరజీవి

అంబు, శంఖు



కాశంవైపు చూస్తున్నాయి. మరికొందరి చేతులు అధర్మ శిక్షణకోసం తుపాకీలలోనికి తూటాలను ఎక్కిస్తున్నాయి. మరికొందరి చేతులు టాంకుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్నాయి. ప్రతి ముఖంలోను ఆందోళన, ఆత్రత, తెగింపు, ప్రాణభీతిరాహిత్యం, మాతృదేశ ప్రేమ ద్యోతకమవుతున్నాయి. ఏ చిత్రకారుని వల్లా సాధ్యం కాదు, ఆ దృశ్యాన్ని అర్థయుక్తంగా చిత్రించడం. ఏ కవి ఎన్ని సీసాలు, కందాలు వాడినా వారి మనస్సులలోని భావాలను యథాతథంగా వర్ణించలేడు. ఏ రచయిత వేలకొలది కాగితాలపై వారి స్థితిని సుస్పష్టం చేయలేడు.

ఎక్కడో ప్రేలుడు శబ్దం.

అంతే! అందరి కళ్ళూ ఒక్క క్షణం చలించి నిశ్చలత పొందాయి. ఒక్కక్షణం ముందు ఉండిన ప్రశాంతత మరు నిమిషంలో అదృశ్యమయింది. యుద్ధం




- రాగి అడుగు భాగములతో ఆహారము కాలిపోదు, మాడిపోదు.
- అవి వేడిని సమముగా ఎక్కేలా చేస్తాయి.
- వాటిని శుభ్రపరచుట, శుభ్రముగా ఉంచుట సులభము ..కడిగి తుడిచివేస్తే చాలును!

రాగి అడుగు భాగములుగల స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు వంటకు అత్యుత్తమమైనవి. అంతేకాక అవి ఒక జీవితకాలం మన్నుతాయి. వాటిని నేడే కొనండి. వాటితో వండడము సరదాగా వుంటుంది.... శుభ్రము చేయడము ఎంతో తేలిక!

అవి మీ దగ్గరలో లభించకపోతే ఉత్పత్తిదార్ల ప్రతినిధికి వ్రాయండి.

మహాలక్ష్మి మెటల్ ఇండస్ట్రీస్

192 బి, పంజారపోల్ రోడ్, బొంబాయి—4

ఈ ట్రేడ్ మార్క్ కోసం చూడండి Meghdoot

LPE Aiyars I 3 TEL

# అమరజీవి

ప్రారంభమయింది. ఒకటే కోలాహలం. ప్రాణాలు గాలికంటె వేగంగా మరో లోకాన్ని వేరుకుంటున్నాయి. రక్త ప్రవాహాలు గంగానదిని మించిన వేగంతో ప్రవహిస్తూ భారతాంబ పాదాలకు నీరాజనాలు ఇస్తున్నాయి. పట్నుదల ప్రజ్వరిల్లుతూంది ఆ ప్రదేశంలో. మానవులు అక్కడ మహనీయులు అవుతున్నారు.

తరతరాల నుండి యుద్ధ మనేది మానవులకొక విషమ పరీక్షగా నిలిచి ఉంది. యుద్ధాలు నశిస్తాయనీ, ప్రపంచంలో సుఖ శాంతులు వెల్లివిరిసి ప్రజలు సుఖిస్తారనీ అనుకున్న ఆశలు అణగారిపోతున్నాయి. లోకంలో చెడు నశించేంతవరకు ఈ యుద్ధాలు తప్పవు.

"నేడు దేశానికి బలిష్ఠమైనవారు కావాలి. శక్తిలేని మనుష్యుడు జీవించినా, మరణించినా ఒక్కటే. దుర్బలులు నేడు దేశానికి ఏ విధంగా సహకరిస్తారు? ప్రస్తుత పరిస్థితులలో దేశ రక్షణకు బలవంతులైన యువకులు కావాలి. దేశ ప్రజలారా! మీరు మీ మీ కర్తవ్యాలను నిర్వర్తించండి. యువకు లందరూ సైన్యంలో చేరి దేశమాతను రక్షించండి."

'అబ్బా!' బాధగా అనుకున్నాడు రాజారావు. రేడియో నుండి కవి కలం చిమ్మిన నిలవైన పలుకులు అతనికి ములుకులై తగిలాయి. అతనిలోని దేశభక్తి పెల్లుబికింది. మనస్సులో ఆవేశం పొంగులు వారింది.

ఆ ఆవేశం ఇప్పుడే కాదు. 1962 లో చైనీయులు కళా సమన్వితమైన దేశసంపదను చూసి తమ అసూయా పూరిత నేత్రాలలో నిప్పులు పోసుకొని, మన దేశం వైపు దురాశ అనే తుపాకీని గురి పెట్టినపుడు కూడా పెల్లుబికింది. అతని ముఖంలో ఆ ఆవేశం వేయి అద్దాలలోలా ప్రతిబింబిస్తూంది. అతను ఆ ఆవేశాన్ని నిరోధించలేడు. నిరోధించాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు అతను. ఆ ఆవేశం అతని సర్వాంగాల్లోనూ వ్యాపిస్తూంది.

పార్క్ నుండి బయటకు నడుస్తున్న అతని అడుగులు తడబడుతున్నాయి. అతని సర్వాంగాలలో వ్యాపించిన ఆవేశానికి విరుద్ధంగా అతని పెదవులు అస్పష్టంగా కంపిస్తున్నాయి.

'నేను నిష్ప్రయోజకుణ్ణి! నిస్సందేహంగా నేను నిష్ప్రయోజకుణ్ణి'— అతనిలోని ఈ భావం అతణ్ణి ఈ నాడే కాదు, అతడు తన బాధ్యతలను గుర్తించిన కాలం నుండీ విపరీతంగా బాధిస్తూంది.

'నేను నా దేశానికి ఏం చేయగలను?' అని అతడు ఆత్మ విమర్శ చేసుకొన్న రోజుల్లో, 'ఏమీ చేయలేను' అనే జవాబు అతని నిస్సహాయతను రెచ్చగొట్టేది.

సన్నగా, మిక్కిలి పొడుగ్గా, దుర్బలతతో, వేగంగా గాలి వీస్తే ఒరిగిపోతాడేమో అన్నంత దుర్బలతతో కూడిన అతను నడుస్తున్నాడు. అతని సర్వావయవాల్లోను దుర్బలత, నిస్సహాయతల ప్రతిబింబాలే కనబడుతున్నాయి. అతని కళ్ళముందు తన దుర్బలత

పైశాచిక నృత్యం చేస్తోంది. అతడు తన ఆవేశం అంతా నిష్ఫలమైనదని తెలుసుకున్నప్పుడు, తన లోని ఆవేశం పమసి చల్లారిపోవాలే తప్ప వెలికి వచ్చి ప్రకాశించే అవకాశాలు లేవని గ్రహించినప్పుడు అతని బాధకు అవధులు ఉండేవి కావు.

చైనీయుల దురాక్రమణ సమయంలో అతడు తన స్థితిని కూడ తెలుసుకోలేనంత ఆవేశంతో వేగంగా వెళ్ళి రిక్రూయిటింగ్ ఆఫీసర్ని ప్రాధేయపడ్డాడు, తనకు మాతృదేశ రక్షణలో భాగస్వామ్యం ఇప్పించమని.

ఆయన అతని వైపు చూసి జాలిగా నవ్వి, "నో, మిస్టర్! అందరికీ అవకాశాలు లభించవు. యు ఆర్ అన్‌ఫిట్" అన్నాడు.

"సార్! ఎందుకు నన్ను ఆర్మీలో చేర్చుకోరు? నాలో ఏమిటి, సార్, లోపం? నేనెందుకు దేశ సేవా సౌభాగ్యాన్ని సంపాదించలేను?" అన్నాడు రాజారావు తన బలహీనమైన హస్తాలను వేగంగా ఊపుతూ.

"సారీ, మిస్టర్! ఆవేశం ఉన్నంతమాత్రం చేత పరిపోదు. అర్హతలు ఉండాలి. అంతేకాక బలం, ధైర్యం, సాహసం ఉండాలి. నీకు గల ఈ ఆవేశం చూస్తుంటే నాకు ఎంతో గర్వంగా ఉంది. నిన్ను ఇప్పుడే మిలిటరీలో చేర్చుకోవాలని ఉంది. కానీ నీకు కావలసిన అర్హతలు లేవు. అందుకు నేను చాలా విచారిస్తున్నాను."

ఆయన అతనిపై సానుభూతిని ప్రదర్శించినపుడు అతనికి ఈ లోకంతో తెగతెంపులు చేసుకొని ఎక్కడికో అనంత విశ్వాలలోకి, దిగంతరాళాల్లోకి చొచ్చుకుపోవాలనిపించింది. కాని, అతను మానవమాత్రుడు. అంతేకాదు. దుర్బలత్వం ఆవరించిన దౌర్భాగ్యుడు.

అందమైన శ్రీనగర్ రోడ్లపైన సంచరిస్తున్నప్పుడు అతనికి తన పైనే జగుప్స, కోపం రగిలాయి. అతనిలోని నమ్మకాలు సడలసాగాయి. దైవం మీదనే అనుమానాలు అధికం కాసాగాయి.

అతని నేత్రాల ముందు లడఖ్ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం, ముందు ముందుకు చొచ్చుకు వస్తున్న చీనా సైనికులు, వారి వెనక ఉన్న అదృశ్య శక్తులు కదలాడుతూ అతనిని రెచ్చ కొట్టసాగాయి. లోకం చేసే పరిహాసాలు అతనిలోని బాధను మరింత అధికం చేశాయి.

'తాను దేశ రక్షణకు అనర్హుడు' అన్న విషయం తెలియగానే అతని కి ప్రపంచం మీదనే రోత కలిగింది. తను తన దేశానికి ఏ విధంగా ఉపకరిస్తాడు? తనకు తరతరాలకు తరగని ఆస్తి లేదే! పెద్ద ఉద్యోగం అయినా లేదు. ఎలా? ఏ విధంగా తను దేశాన్ని కాపాడగలడు? ఏ విధంగా దేశానికి సహాయం చేయగలడు?— అన్న ప్రశ్నలు అతణ్ని వేధించ మొదలిడినాయి. యాదృచ్ఛికంగా అతని కళ్ళు చుట్టూ ఉన్న పరిసరాలను చూస్తున్నాయి. కాళ్ళు గమ్యస్థానంకేసి ప్రయాణిస్తున్నాయి. ఆ నేత్రాలలో జీవం నశించింది.

కాని, ఒక్క క్షణంలో కోటి సూర్య కాంతులు ఆ కళ్ళలో ప్రకాశించాయి. కళ్ళలో కాంతుల మధ్య బాష్పాలురాలాయి, ఇంద్రధనుస్సును జ్ఞప్తికి తెస్తూ. ఒక్క క్షణం ఆగి ఆనందంతో మాటలు తడబడగా, మనస్సు మూగపోగా ఆ బోర్డు ఒక్కసారి చదువుకున్నాడు.

"దేశపు అత్యవసర పరిస్థితులలో దేశంకోసం పోరాడుతున్న మన జవాన్ల కొరకు రక్తదానం చేయండి."

రక్తదానం!

అతనిలో తిరిగి ఉత్సాహం చెలరేగింది. 'ఇస్తాను.., నా రక్తమంతా ఇస్తాను... నావల్ల నా దేశానికి ఈ మాత్రమన్నా సహాయం జరిగితే... అంతే చాలు!' తృప్తి సహితమైన విశ్వాసం హృదయాంతరాళాల నుండి వెలువడగా వేగంగా హాస్పిటల్‌లోకి నడిచాడు.

ఎదురుగా రక్తదానం చేసి వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఎదురయ్యారు. అతను వారికేసి సంతోషాతిశయాలతో చూశాడు. తనే రక్తదానం చేసినంత ఆనందం అనుభవించాడు.

డాక్టర్ బయటికి వచ్చి, "కమిన్" అన్నాడు. రాజారావు అనుసరించాడు ఆయన్ని. ఇద్దరూ కుర్చీలలో కూర్చున్నారు.

"వాట్ డూ యూ వాంట్?" అన్నారు డాక్టర్ గారు.

ఆయన ప్రశ్నకోసమే ఎదురుచూస్తున్న రాజారావు, "రక్తదానం చేయడానికి వచ్చాను, డాక్టర్" అన్నాడు ఉత్సాహం నేత్రాలలో ద్యోతకమవుతూండగా.

డాక్టర్‌గారు ఆశ్చర్యపోయారు. వెంటనే ఆయన పెదవుల మీద ఒక మందహాసం చోటు చేసుకుంది.

"వేళాకోళం ఆడుతున్నారా నాతో?"

"లేదు, డాక్టర్! నిజంగానే అంటున్నాను. మన జవాన్లకు రక్తదానం చేయాలని వచ్చాను. నా కోరిక తిరస్కరించకండి." పలుకులలో బాధ ప్రజ్వరిల్లుతుండగా అన్నాడు రాజారావు.

డాక్టర్‌గారు లేచి గంభీరంగా పచార్లు చేయసాగారు. ఆయన ముఖంలో అనేక భావాలు వెల్లివిరుస్తున్నాయి. ఒక్క క్షణం ఆలోచించి, "లోపలికి రండి" అని ఒక గదిలో ప్రవేశించారు. రాజారావు కూడా లోపల ప్రవేశించాడు. గది తలుపులు మూసుకున్నాయి.

పది నిమిషాల భయంకర నిశ్శబ్దానంతరం గది తలుపులు వికృత శబ్దంతో తెరుచుకున్నాయి. డాక్టర్ వెనకనే రాజారావు కూడా హాల్లోకి వచ్చాడు.

డాక్టర్ గారి కంఠంలో నిశ్చితత్వం మార్మోగుతూండగా, "నో మిస్టర్. మీరే రక్తం తీసుకోవలసిన పరిస్థితిలో ఉన్నారు. ఈ టానిక్స్ తీసుకోండి. బలానికి వేరే మందులు తీసుకోవాలి" అంటూ ఒక కాగితంపై పెన్‌తో ఏదో వ్రాసి ఇచ్చారు.

అతని ముఖం పర్వదమ్మైనదిలా మారింది. లోనికి వెళ్ళిన వ్యక్తి, తిరిగివచ్చిన వ్యక్తి ఒక్కరే. కాని, పరిస్థితులవల్ల అతని ముఖంలో అటువంటి మార్పు కలిగింది. మానవుడు పరిస్థితులకు శాశ్వతమైన బానిస.

తను రక్తదానం చేయలేకపోగా తనకే రక్తం అవసరమట! ఎంత దౌర్భాగ్యపుస్థితి తనది! అతను

చర్మ శుభ్రతకు

నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

శుభవార్త

డాక్టర్లకు సాధ్యంగాక వదలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును.

మధుమేహము, రక్తపు పోటు, కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, సంతానము లేనివారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్సవలన దేహములో వున్న వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు ఒక రూపాయి పంపవలయును.

శ్రీ యోగాశ్రమము,
పి. ఓ. పెదవాల్తేరు, విశాఖపట్టణము

చేతిలోని చీటీని కసిగా నలిపివేశాడు. అతనిలోని ఆశలన్నీ అణగారిపోగా విషపూరితమైన ఆవేశంతో మిగిలిపోయాడు అతను ఆనాడు.

నేడు తిరిగి ఆ ఆవేశం అతనిలోని ప్రతి అవయవాన్నీ స్వాధీనం చేసుకొంది. చంచలమైన కళ్ళతో అతను చుట్టూ చూశాడు. ఒక్క క్షణం అతని పెదవులపై చిరునవ్వు మెరిసింది. ఆ చిరునవ్వు అతి భయంకరమైనది. మానవుడు నిస్సహాయతతో తనపై తనకే నమ్మకం పోయినపుడు తనపై తనే జాలి పడుతూ నవ్వుకునే క్రూరమైన నవ్వు అది. ఆ నవ్వుతోనే అతడు తన ఇల్లు దాటి ఒక ఫర్లాంగు దూరం ముందుకు పోయాడు. తన తెలివితక్కువతనానికి నవ్వుకున్నాడు. కాని, అందుకు అతడు కారకుడు కాడనీ, మానవుల ఆలోచనల సమన్వయించే మనస్సు కూడా పని చేస్తుందనీ అతడు గ్రహించలేకపోయాడు. బహుశా మరే మానవుడూ కూడా గ్రహించలేడేమో! వెనుదిరిగాడు అతను.

ఇంటిలో ప్రవేశించాడు. ఎదురుగా కనపడిన ఒక చిన్న 'డిబ్బీ'ని చూడగానే అతని నేత్రాలు ఒక్క క్షణం వింతగా ప్రకాశించాయి. అతడు దాన్ని సమీపించాడు. వణుకుతున్న హృదయంతో, చలిస్తున్న చేతులతో జేబులో నుండి ఒక అర్థ రూపాయి నాణాన్ని తీసి ఆ డిబ్బీలోనికి జార విడిచాడు. అతని హృదయం నుండి సంతృప్తి అసంతృప్తులతో కూడిన నిట్టూర్పు ఒకటి వెలువడింది.

తను చేసేది, చేయగలిగేది, చేయబోయేది ఇది ఒక్కటే. ఇంతకంటే దేశానికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి అనుభవిస్తున్నాడు. సిటీ బస్సులలో ప్రయాణించడం వంటి శారీరక సుఖాలను త్యజించి మిగిల్చిన ధనాన్ని రక్షణ నిధికి అర్పించడం కంటే తనేమీ చేయలేడు. తను నిస్సందేహంగా నిష్ప్రయోజకుడే! బాధగా నిట్టూర్చాడు రాజారావు.

ఒకసారి చుట్టూ కలయజూశాడు. ఆ కళ్ళలోని అన్వేషణ ఫలించింది. ఒక వృద్ధుని కేసి అతని దృష్టి ప్రసరించింది. అతను నిద్రిస్తున్నాడు. రాజారావు రెప్పవేయక నిశ్చలంగా ఆ వృద్ధుని వైపే చూస్తున్నాడు. కాని, కళ్ళలోని నిశ్చలత మనస్సులో స్థానాన్ని సంపాదించుకోలేకపోయింది. అతడు శాంతిని కోరి ఇంటికి వస్తే అక్కడ కూడా అశాంతి తన హేళనా పూరితమైన విషపు చిరునవ్వు అతనిపై ప్రసరింప జేసింది.

'అదృష్ట వంతుడు!' అతని మనస్సు బాధగా మూలిగింది. 'చేయగలిగినవాళ్ళు దేశసేవ చేశాడు. దేశమాత పాదపద్మాలను సేవించాడు. దేశ మాతను పరిరక్షించగల అవకాశం అతడికి లభించింది' అనే విషయాలు రాజారావుకు స్ఫురించినప్పుడల్లా అతనిలో అసూయ చెల రేగేది.

ఆ వృద్ధునికీ రాజారావుకూ ఏదో చెప్పలేని అనుబంధం. ఇరువురిదీ కొన్ని విషయాలలో భిన్నాభిప్రాయాలు. అయినా, వారి అనుబంధం అందువల్ల చెడిపోలేదు. సృష్టి విచిత్రాలలో విభిన్న వ్యక్తులను చేర్చడం ఒకటేమో!

ఆ వృద్ధుడు తాను సిమాంతబలంలో పని చేసిన రోజులలో తను పొందిన అనుభవాలు, చేసిన సాహసాలు, ప్రపంచ యుద్ధంలో ఎదుర్కొన్న కష్టాలు చెపుతూంటే రాజారావు శరీరంలోని ప్రతి అణువూ ఉద్వేగంతో వణికిపోయేది. ఆ వృద్ధుని భాష కొంత మొరటుగా ఉంటుంది. హిందీ, ఉర్దూ, తెలుగు భాషలన్నీ కలిపి అతను మాట్లాడుతూంటే రాజారావుకు మొదట్లో అతనిని పరిహసించాలని అనిపించింది. కాని, పరిహాసంవలన మానవులకు కలిగే బాధ తనకు తెలుసును గనక, ముఖ్యంగా అందరి దృష్టిలో తానొక పరిహాస వ్యక్తి కావడం చేత ఆ వృద్ధుని, అతని మంచి మనస్సును అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు రాజారావు. మరొకడి బాధను బాధగల వ్యక్తే అర్థం చేసుకోగలడు కాబోలు!

ఆ వృద్ధుని జీవితంలో అధికభాగం యుద్ధాలకు, మిలిటరీ జీవితానికి అంకితమయిందని విన్నప్పుడు రాజారావు దృష్టిలో ఆ వృద్ధుడు మహా యోధ్ధగా మారిపోయాడు. ఆ వృద్ధుని ముఖం మీద ముడతలలో రాజారావు జీవితపు ప్రతిబింబాలయిన అనుభవాలు చూసేవాడు. అటువంటి అదృష్టం తనకు లేనందుకు తీవ్ర శోక నిమగ్నుడు అయ్యేవాడు. తనకు ఆ అదృష్టాన్ని కలగజేయాలని భగవంతుని ఎంతగానో ప్రాధేయపడేవాడు. అతని శరీర దుర్బలతను ఎరిగినవారు అతని ఆవేశాన్ని చూసి నవ్వుకునేవారు. అప్పుడప్పుడు తన బాధను ఆ వృద్ధుని వద్ద వెళ్ళగక్కేవాడు.

"ఊరుకో, బాబూ! ఏం బెంగపడకు. ఏడిస్తే లాభ మేమిటి?" అని ఆ వృద్ధుడు ఓదార్చేవాడు. వా రిరువురి మధ్యా ఏ అనుబంధమూ లేకున్నా తమ మధ్య ఏదో అనుబంధం ఉందని రాజారావు భావించేవాడు. ఆలోచనలో నిమగ్నుడయిన రాజారావు ఆ వృద్ధుడు లేవడం గమనించనే లేదు.

"ఎప్పుడొచ్చావు, బాబూ? డ్రెస్ మార్చుకోలేదేం? చాయ్ ఇదిగో. మిలిటరీలో ఉన్న ఈ అలవాటును మానుకోలేకపోతున్నా" అని ఫ్లాస్కులోని టీని కప్పులో పోసి రాజారావుకు అందిస్తూ నవ్వాడు ఆ వృద్ధుడు.

ఆ వృద్ధుని తెలుగు భాషకు రాజారావు నవ్వుకోలేదు. అతను ఆ భాషను ఆ మాత్రమయినా ఎక్కడా వినలేదు ఆ శ్రీనగర్ మహాపట్టణంలో.

"ఇప్పుడే వచ్చాను, బాబాయ్!... అరె! మీ కెందుకు శ్రమ? నేను తీసుకొందునుగా?" అన్నాడు రాజారావు టీ కప్పు అందుకుంటూ.

"దానికేంలే, బాబూ! ఇందులో శ్రమ ఏమిటి?" అని చిరునవ్వు నవ్వాడు ఆ వృద్ధుడు.

రాజారావు ఆ వృద్ధునివద్ద అనేకములయిన అమూల్యమైన అనుభవాలనే పాఠాలను నేర్చుకున్నాడు. ఎన్నో విషయాలు తెలిసిఉన్న రాజారావు ఆ వృద్ధునిముందు తెలియనివాడయ్యాడు, అధికుడైనా తనకంటె అధికుని ముందు అల్పుడు అవుతాడు అనడానికి నిదర్శనంగా.

టీ తాగుతున్నవా రిరువురి చూపులూ కలిశాయి.

"ఏమిటయ్యా, విశేషాలు?" వృద్ధుడు ప్రశ్నించాడు. రాజారావు ముఖం ఒక్కసారిగా వెలిగింది. అతనికి తెలుసు ఆ వృద్ధుడు దేన్ని గురించి ప్రశ్నిస్తున్నాడో. భగవంతుడు మానవునిఎడల జంతు పశు పక్ష్యాదులకంటె పక్షపాతం చూపి, ప్రసాదించిన వరాల్లో, ఎదుటి మనస్సును అంచనా వేయగల శక్తి ఒకటి.

"బాబాయ్, యుద్ధం విపరీతంగా జరుగుతూంది. మనవాళ్ళ చేతిలో పాకిస్తానీలు నిలవలేక పోతున్నారు. మనవాళ్ళు అప్పుడే నాలుగు స్థావరాలను పట్టుకున్నారు. వారి విమానాలను ఎన్నిటినో ధ్వంసం చేశారు. అనేకులు పారాట్రూపర్లు పట్టుపడ్డారు. గ్రామస్థులు కూడా తమ ప్రాణాలకు తెగించి దేశ సేవ చేస్తున్నారు; ఎంతో మందుగుండు సామాను మనకు వశమయింది. ఎలాగైనా మన భారతీయులు వీరులే, బాబాయ్! వారికి గల అచంచల దీక్ష, పట్టుదల, ఆత్మ విశ్వాసం ఎవరికి వస్తాయి? ఎన్ని కష్టాలు వచ్చినా భారతీయులు వెనకంజ వెయ్యరు, బాబాయ్!" రాజారావు ఉత్సాహం అవధులు దాటి ప్రవహించింది. పరవళ్ళు తొక్కుతున్న గంగానదిలా ఉంది అతని ఉత్సాహం.



రుధిరాశ్రువు

చిత్రం—రీల (గోపన్నపాలెం)

"నిజమే, బాబూ! ఆవేశం కంగారు నీ లాంటి వారికి సహజం! కానీ, నాకు యుద్ధం అంటే విసుగు పుట్టింది. ఎందుకు, బాబూ, ఈ యుద్ధాలు, మనుషులు సుఖంగా బతకడానికి వీలులేకుండా?"

"అలా అనకండి, బాబాయ్! మన అంతట మనం యుద్ధానికి దిగలేదు. మనం శాంతిప్రియులం. యుద్ధం మన కనవసరం. కానీ, దేశాన్ని రక్షించుకోవద్దా, బాబాయ్? మన ఇంట్లోకి ఎవరో వచ్చి ఇల్లు తమదే అంటే మనం సహించి ఊరుకోగలమా? అలాగే కాశ్మీరు మనది. ఏనాడో అది మిగిలిన రాష్ట్రాల లాగే కలిసిపోయింది. ఆ విషయాన్ని గురించి కలహం లేవదీసి మనల్ని బెదిరించినంత మాత్రాన మనం లొంగుతామా? లొంగం. కాశ్మీరుని పరిరక్షించుకుంటాం. శాంతిప్రియత్వమంటే అసమర్థత

(తరువాయి 39 వ పేజీలో)

# అమరజీవి

(37 వ పేజీతరువాయి)

కాదు, బాబాయ్.'' గదిలోని దీపపు వెలుగు అతని ముఖంపై పడి వింతగా ప్రకాశిస్తూంది. అతని ఆవేశ పూరితమయిన మాటలు ఆ నిశ్శబ్ద వాతావరణంలో ప్రతిధ్వనిస్తున్నాయి. చంద్రుడు లోకంలోని అన్యాయాలను సహించలేక ధర్మపథం వెదుక్కుంటూ కాబోలు, నల్లని మబ్బులు చీల్చుకుంటూ తెల్లని మబ్బుల మీద పరుగులు పెడుతూ పయనిస్తున్నాడు.

చాలా సేపటివరకు వా రిరువురి మధ్య సంభాషణలు కొనసాగుతూనే ఉన్నాయి. చివరికి గోడమీద గడియారం పన్నెండు గంటలు కొట్టడంతో ఇరువురూ తమ శయ్యలను ఆశ్రయించారు.

• • •

రోజులు వేగంగా ప్రవహించాయి. రాజారావు ఇప్పుడు మామూలు రాజారావు కాదు. పైలట్ రాజారావు! అతను ఇప్పుడు అందరి చేతా పరిహసింపబడే, చిరుగాలికి కూడా ఊగిపోయే రాజారావు కాదు. తన నిరంతర శ్రమ ఫలితంగా ఈ నాడు అతను తను కోరిన స్థితికి వచ్చాడు.

ఈ రోజే అతడు లాహోర్ రంగంపై 'బాంబింగ్' చేయబోతున్నాడు. నేడే అతడు భారత దేశాన్ని ముష్కరుల బారి నుండి రక్షించటంలో పాల్గొంటున్నాడు. రాజారావులో ఉత్సాహం పరవళ్ళు తొక్కుతూంది. పై అధికారి అతణ్ణి పిలిపించాడు.

"రాజారావ్! నువ్వు ఇప్పుడు లాహోర్ రంగం మీదికి వెళ్ళబోతున్నావు. అక్కడ ప్రతి క్షణం నువ్వు జాగ్రత్తగా ఉండాలి. నువ్వు మోసపోగల అవకాశాలు అనేకం వారు కల్పిస్తారు. యు మస్ట్ టేక్ మచ్ కేర్. మరొక ముఖ్య విషయం. దీన్ని ఎవరూ మరవకూడదు. మనం ధ్వంసం చేయ వలసినది వారి మిలిటరీ విమానాలను మాత్రమే. మనకు వైరం ప్రభుత్వంతో మాత్రమే. ప్రజలతో కాదు. ఈ విషయం మరిచిపోకు. విజయంతో తిరిగిరా.'' హిందీలో అన్నాడు అధికారి.

"నా శాయశక్తులా ప్రయత్నించి శత్రువులకు నష్టం కలిగిస్తాను, సార్! ఇందులో నా ప్రాణాలు పోయినా లక్ష్యపెట్టను. మన విమానాన్ని సురక్షితంగా తీసుకువస్తాను.'' రాజారావు మాటలలోని ఆ ధైర్యం, గంభీరత్వం అతని మనఃస్థైర్యాన్ని సూచిస్తున్నాయి.

అధికారి ప్రశంసా పూర్వకమైన చిరునవ్వుతో, "గుడ్! విష్ యూ గుడ్‌లక్'' అని భుజం తట్టాడు. తోటి ఉద్యోగులు చేసే హర్ష ధ్వానాలు, హెచ్చరికలు అతనికి అధిక ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి. అతని కళ్ళ ముందు లాహోర్ విమానాశ్రయము బాంబులు కురియగానే మిన్ను ముట్టే మంటలతో కాలిపోతున్న విమానాలు కనపడుతున్నాయి. మిత్రులందరి వద్ద వీడ్కోలు పొంది ఉత్సాహంతో బయలు దేరాడు రాజారావు.

విమానం రివ్వున ఆకాశంలోకి శరవేగంతో దూసుకుపోతూంది. అధర్మాన్ని నిర్మూలించడానికి అతని చేతులు మరింత తొందరపడుతున్నాయి. అతని కళ్ళు బైనాక్యులర్స్ నుంచి తీక్ష్ణంగా పని చేస్తున్నాయి.

కొద్ది క్షణాలలో లాహోర్ ఏరియాను చేరుకుంది విమానం. కిందనుండి శతఘ్నులు పేలుతున్నా అతని లక్ష్యాన్ని ఏకైక ఆశయాన్ని చెదరగొట్ట లేకపోయాయి. అతని మనస్సు ఉద్వేగంతో ఊగిపోతూంది.

మరు క్షణంలో విమానాశ్రయం నుండి బయలు దేరుతూన్న మూడు సైనిక విమానాలు బాంబుల వర్షానికి ఆహుతి అయ్యాయి. ఆ మంటలు ధర్మదేవత పాదాలకు నీరాజనాలు ఇచ్చాయి. మరుక్షణంలో అక్కడే ఉన్న సైనిక స్థావరంపై బాంబులు కురిసి ఆ స్థావరం ఫెళఫెళారావాలతో కూలిపోగా అవి ధర్మదేవత విజయానికి భేరీ నినాదాలయ్యాయి. కసిగా నవ్వుకున్నాడు రాజారావు. అప్రయత్నంగా అతని దృష్టి కిందికి మళ్ళింది.

ఒక విమానం పైకి దూసుకు వస్తూంది. మరు క్షణంలో అది అగ్నిజ్వాలలతోపాటు కిందికి కూలిపోయింది. ఆ విమానం అలా జ్వలిస్తూంటే అతని హృదయం కూడా ధర్మదేవతతోపాటు సాగర తరంగాలలా ఘోష పెడుతూంది ఆనందాతిశయాలతో.

తల పైకెత్తిన రాజారావు ప్రమాన్పడి పోయాడు. నాలుగు వైపులనుండీ విమానాలు అతనివైపు ప్రళయకాల మేఘాల్లా చొచ్చుకు వస్తున్నాయి. రాజారావు తన నైపుణ్యాన్ని ప్రదర్శించి విమానాన్ని కాపాడ ప్రయత్నించాడు. అతని ముఖంలోని స్వేద బిందువులు అతని పట్టుదలను సూచిస్తున్నాయి. అధికారి మాటలు మాటిమాటికి గుర్తుకు వచ్చి అతణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తున్నాయి. వెనక విమానాల నుండి వస్తున్న గుళ్ల బారి నుండి తనను రక్షించుకోవాలని ప్రయత్నించటం లేదు అతడు. విమానాన్ని రక్షించడమే తన ముఖ్య కర్తవ్యంగా భావించాడు. తన దేశ సంపదను కాపాడాలనే ప్రయత్నిస్తున్నాడు అతడు.

కాని, విధి ప్రతికూలించింది. ఉన్నట్లుండి ఒక తుపాకి గుండు అతని వీపులోనుండి దూసుకుపోయింది. వెనువెంటనే అతని స్థితిని పరిహసిస్తూ విమానం మీద ఒక బాంబు పడింది. దురదృష్టదేవత రాజారావును వరించింది. విమానం వేగంగా అంటుకుంది.

రాజారావు చైతన్యస్థితిని క్రమంగా కోల్పోతున్నాడు. అతణ్ణి సమీపిస్తున్న మంటలు అతని నేత్రాలలో ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. జ్వాలల మధ్యలో ఉన్న రాజారావు వికృతంగా అరిచాడు.

• • •

ఉలిక్కిపడి లేచాడు రాజారావు. అతడు లాహోర్ విమానాశ్రయం వద్ద అంటుకున్న విమానంలో లేడు. అతని చుట్టూ ఉన్న నాలుగు గోడలూ అతణ్ణి వెక్కిరించాయి. తన స్థితి అర్థమయింది అతనికి. అతని


ఇంకా పొడుగు ఎదగండి



నూతన శాస్త్ర పద్ధతులతో, వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి, ఆరోగ్యవంతులు కండి. స్త్రీ, పురుషులకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి లేదు. వివరములు ఉచితం.

TOTAL HEALTH
Azad Market (A.P.V.)
Delhi-6



KESAVARDHINI

నిగనిగలాడు నలని నిడుపాటి అందమైన కేశములకు

కేశవర్ధిని

అద్వితీయమైన హేర్ ఆయిల్




కేశవర్ధిని షాంపు

ఉపయోగించి మీ కురులను శుభ్రముగా, సువాసనగా ఉంచండి

కేశవర్ధిని ప్రొడక్ట్స్, మద్రాసు—14.

